# మోడల్

పులిపాక శ్రీరామచంద్రమూర్తి

**స్టాఫ్ రూమ్‌లో** కాళ్ళు గోడకి నిగడదన్ని చిద్విలాసంగా సిగరెట్ ముట్టించాడు సోషల్ టీచరు రాందాసు. అత నంత చిద్విలాసంగా ఉండడానికి రెండే కారణా లున్నాయి. అందులో మొదటిది-అతని కింకా పెళ్ళి కాలేదు. రెండోది-అది నెలలో మొదటి వారం

పక్కనున్న డెస్కు బెంచీ మీద తెలుగు టీచరు (టీచరు పుంలింగమని. టీచరమ్మ స్త్రీ లింగమని ఎఱుంగునది) కాంపోజిషన్లు దిద్దుతూ మార్కులు బాగా తగ్గించి వేయగలిగినందుకు చాలా హేపీగా ఫీలవుతున్నాడు. ఆ స్టాఫ్ రూమ్ అంతా చిన్న చిన్న చాక్‌పీసు ముక్కలతో. చినిగిన డస్టర్లతో. సిగరెట్ పీకలతో. దుమ్ముకొట్టుకుపోయిన ఆన్సర్ పేపర్లు. గాంధీగారి ఫొటోతో. అట్టలూడిపోయిన పుస్తకాలతో మ. ఘ. వ. ప్రభుత్వం వారు కొత్తగా ప్రవేశపెట్టిన పాఠ్య పుస్తకంలా పరమ గందరగోళంగా. చిరాకుగా ఉంది.

సిగరెట్ పీల్చి రింగులు రింగులుగా (స్టాఫ్ రూమ్‌కి వెంటిలేషన్ లేదు) పొగ వదులుతూ పారవశ్యంలో ఉన్నాడు రాందాసు. సరిగ్గా అప్పుడే అతని చెవిదగ్గర రెండు చిటికెలు వినిపించాయి. రాందాసు తలెత్తి చూశాడు.

"హెడ్మాస్టరు మిమ్మల్ని పిలుస్తున్నారు" అన్నాడు అటెండర్ గోవిందం నవ్వుతూ.



"ఆయన పిలిస్తేమాత్రం నువ్వు నవ్వుతూ చెప్పాలా?" సైరన్‌లా అరిచాడు రాందాసు.

"నే నెందుకు నవ్వుతాను? ఆయన పిలవమంటే పిలవడానికి వచ్చాను" అన్నాడు గోవిందం. అత నెవర్నీ 'సార్' అని మన్నించడు.

"ఆయన టీచర్లలో ఎవర్ని పిలవమని చెప్పినా, నువ్వు నవ్వుతూ స్టాఫ్ రూమ్‌లోకి రాకూడదు. మమ్మల్ని ఏదైనా తిడితే నవ్వుకుందామనే కుళ్ళు బుద్ధి ఉండకూడదు నీకు" అని వార్నింగ్ ఇచ్చి ఆఫీసు రూమ్‌లోకి వెళ్ళాడు రాందాసు.

హెడ్మాస్టరు గది నీట్‌గానే ఉంది కాని. ఆయన టేబుల్ మాత్రం డిగోగార్షియాలా ఉంది. పుస్తకాలు, ఫైళ్ళు, కాగితాలు, రెండు పేపర్ వెయిట్లు. ఒక రూళ్ళకర్ర. పెన్ స్టాండు. పిల్లలకోసం తెచ్చి పెట్టిన కొత్త నోట్ బుక్కులు ఉన్నాయి ఆ టేబుల్ మీద. వాటి మధ్య హెడ్మాస్టరు శేషావతారం ఆదిశేషుడిలా(?) ఉన్నాడు. ఆయనకి పెద్ద బొర్ర-దానికి తోడు ఇన్‌షర్ట్ చేస్తాడు. ఆయన్ని చూడగానే 'ఇన్‌షర్ట్ చేయడమైనా మానుంత. లేదంటే బొజ్జన్నా కరిగించుకోంత' అని చెబుదా మనుకుంటాడు రాందాసు. శేషావతారం కుర్చీ చూపించి రూళ్ళకర్రతో ఫాను స్పీడు పెంచాడు.

"నేనే ప్రధానమంత్రినయితే. టీచర్లెవ్వరికీ అయిదు పైసలు కూడా జీతం ఇవ్వను (హెడ్మాస్టర్లకు తప్ప). నీలాంటి వాళ్ళకి అసలివ్వను. ఇందాక ఎనిమిద్ క్లాసుకి వెళ్ళి 'ప్రధానమంత్రి ఎవర్రా' అని అడిగితే ఒక సినిమా యాక్టరు పేరు చెప్పారు మూకుమ్మడిగా. అంటే. పిల్లలకి జనరల్ నాలెడ్జి ఏమీ లేదన్న మాట. జి. కె. చెప్పడం ఎవరి డ్యూటీ? మీది. అది మీ డ్యూటీ ఎందుకంటే? మీరు ఎస్. ఎస్. టీచర్ కనక."

రాందాసు ఏదో చెప్పబోయాడుకాని. శేషావతారం తను మాట్లాడ్డం తప్ప ఎదుటి వాడికి ఛాన్సివ్వడు.

"రేపు ఇంటర్ స్కూల్ జి. కె. పోటీలు పెడితే మన వెధవలకి మట్టి బొంగరాలు కూడా దక్కవు. ఈ స్కూల్లో ఎస్. ఎస్. చెప్పే దెవడని జనం కత్తులూ. గొడ్డళ్ళూ పట్టుకొస్తారు. అస లెప్పుడూ దిక్కుమాలిన సింధు నాగరికత. అక్బర్ చేసిన మంచిపనులు తప్ప నువ్వు మూడో ముక్క చెప్పడం నే నెప్పుడూ విన్లేదు."

అప్పుడప్పుడూ జి. కె. కూడా చెబుతుంటాను. సార్" అన్నాడు రాందాసు.

"నువ్వు చెబితే పిల్లల్లో ఎవడైనా ప్రధానమంత్రి ఎవరో చెప్పేవాడే. మనమేం చెప్పకుండా పిల్లలంతా వెధవలని. మా కాలంలో ఇలా ఉండేవాళ్ళం కాదు. చాకుల్లా. బాకుల్లా ఉండే వాళ్ళమని అయ్యర్ టీ కొట్టు ముందు అనుకోవడం నాకు తెలీదనుకోకు."

'మీ కెందుకు తెలీదు? గోవిందంగాడికి తెలిస్తే

మీకు తెలిసినట్టే.' కసిగా అనుకున్నాడు రాందాను.

"అందుచేత ఏమిటంటే మన వెధవలకి (విద్యార్థులని అయ నెప్పుడూ రిఫర్ చెయ్యడు) జి. కె. కావాలి. జి. కె. అంటే ఏమిటి? (ఇలా హెడ్మాస్టరు అడుగుతున్నందుకు మీరేమీ ఆశ్చర్యపడ నక్కర లేదు. ఆయనకి అసలు రాని లెక్కల గురించి. అందులోనూ ట్రిగనామెట్రీ గురించి కూడా అనర్గళంగా మాట్లాడగలడు) జనరల్ నాలెడ్జి. అసలు మన వెధవలకి పార్లమెంటు గురించి తెలుసా? తెలీదు. ఏ పాట ఏ సినిమాలో ఉందో తప్ప. అందువల్ల ఏమిటంటే మన వెధవలకి పార్లమెంటంటే ఏమిటో చెప్పాలి. లేకపోతే వీళ్ళకి పెద్దయ్యాక సివిక్ సెన్సు చిక్కి శల్యమై చచ్చిపోతుంది."

"అయితే మోడల్ పార్లమెంటు చూపించమంటారా?"

"అంటే నేను ఇప్పటిదాకా చెప్పిందే మళ్ళీ మొదట్నించీ చెప్పాలన్న మాట..." విసుగ్గా అన్నాడు హెడ్మాస్టరు.

"అయితే ఎక్స్ట్రా క్లాసు కూడా డీల్ చేయాల్సి వస్తుంది."

"ఎయిత్ వెధవలకి రెండో పీరియడ్ మీరు. మూడో పీరియడ్ ఎవరిది?"

"మీదే!" అన్నాడు రాందాను.

"నాదా?" పరమాశ్చర్యంగా అడిగాడు శేషావతారం. "అయితే నో ప్రాబ్లమ్. నా క్లాసుకూడా తీసుకోండి" అన్నాడాయన ఆశ్చర్యాన్ని ఆనందంలోకి మార్చేస్తూ.

'జి. కె. పేరు మీద క్లాసు తీసుకోకుండా హాయిగా కుర్చీలో కూర్చుంటావన్న మాట.' రాందాను మండిపడ్డాడు మనసులోనే. మహాకవి ఊరికే అన్లేదు 'కుడి ఎడమల దగా దగా' అని. పైకిమాత్రం సన్నజాజి నవ్వు చిలకరించి కుర్చీలోంచి లేచాడు.

"క్లాసు పూర్తికాగానే లెసన్ ప్లాన్ కూడా రాసి తీసుకురండి" అన్నాడు శేషావతారం. రాందాను ఆ గదిలోంచి బైటికొచ్చాడు.

వరండాలోంచి సాధ్యమైనంత మెల్లిగా నడుస్తూ (త్వరగా వెళ్తే క్లాసులో ఎక్కువ సేపు ఉండాల్సొసుంది) ఎనిమిదో క్లాసు గుమ్మం దగ్గర ఆగాడు... కుర్రాళ్ళంతా చాలా హుషారుగా లేచి (ఎక్కువగా కబుర్లు, తక్కువగా పాఠం చెప్పే టీచర్లకు గౌరవము మెండుగా లభించును) 'గుడ్...మార్నింగ్...సార్' అని రాగాలాపన చేశారు. 'వెధవలకి ఈ మూడు ముక్కలుమాత్రం బాగా వచ్చు' అనుకున్నాడు రాందాను. క్లాసులోకి వెళ్తూ మొదటి బెంచీ డెస్కు మీదున్న కుర్రాళ్ళ నోట్ బుక్స్ వైపు చూశాడు రాందాను. అర్థనగ్నంగా ఉన్న సినీ తారల బొమ్మలున్నాయి. ఆ బొమ్మలు దొరకని వాళ్ళు హీరోలతో సంతృప్తిపడ్డారు.

రెండువైపులా ఉన్న బెంచీల మధ్య నడిచి. చివరి వరస బెంచీలదాకా వెళ్ళి 'మేధావుల్ని' చూసి (గొప్పమేధావులు, కళాకారులు, ఆర్టిస్టిక్ వాల్యూస్ ఉన్న వాళ్ళందరూ చివరి బెంచీలలో ఉంటారు) వెనక్కి తిరిగాడు రాందాను.

ప్లాట్‌ఫారమ్ మీదికి ఎక్కి (మైకు మాత్రమే.' ఆ స్కూల్లో ఏ క్లాసులోనూ ప్లాట్‌ఫారమ్ లేదని గ్ర



హించునది) గొంతు సవరించుకున్నాడు రాందాసు. ఏదో ఉపద్రవం ముంచుకొస్తున్నట్టు పిల్లలంతా బిక్క మొహాలు పెట్టారు.

"ఇప్పుడు మీకు పార్లమెంటు గురించి చెబుతాను. అందులో ఉండే సభలు, వాటి కార్యక్రమాలు, వాటిని ఎవరు, ఎలా నడిపిస్తారు? వీటిగురించి చెప్పి, తర్వాత మోడల్ పార్లమెంటు చూపిస్తాను. నేను చెప్పినట్టు వినని వాణ్ణి డొక్క చించేస్తాను" అన్నాడు రాందాసు. పిల్లలంతా తలూపారు. హెడ్మాస్టరు మీద కోపం, కాలుస్తున్న సిగరెట్ పారేసినందుకు వచ్చిన విసుగు రాందాసు ముఖంలో కనిపించాయి పిల్లలకి. అతని మూడ్ నిబట్టి వాళ్ళందరి మూడ్ క్షణంలో మారిపోయింది.

"పార్లమెంటంటే ఏమిట్రా?" అడిగాడు రాందాసు.

"మన క్లాసురూమ్ లాగానే ఏ గొడవైనా చెయ్యడానికి వీలున్న చోటని తెలుగు మస్టారు చెప్పాడు. సార్" అన్నాడు పొట్టి శీను. అతనికి రాందాసు దగ్గర చనువెక్కువ. రాందాసుకి కావాల్సిన సిగరెట్లు, కిళ్ళీలు, ప్రేమ నవలలు అన్నీ అతనే తెచ్చిస్తాడు.

"అది తప్పు. పార్లమెంటులో ప్రజాప్రతినిధులుంటారు. అందులో ఎన్ని సభ లున్నాయి?"

"రెండు, నాలుగు, ఆరు, పది, పన్నెండు, ముప్పై..." ఎవరికి తోచింది వాళ్ళు చెప్పుకుపోతున్నారు.

"ఆపండి, వెధవల్లారా. రెండు సభలే ఉంటాయి." అరిచాడు రాందాసు. రెండు సభలని చెప్పిన కుర్రాడు తలెగరేసి మిత్రులవైపు గర్వంగా చూశాడు.

"వాటి పేర్లేంటి?"

"లోక సభ, రాజ్య సభ."

"ఎక్స్‌క్యూజ్ మీ, సర్. ఏమిటి, పార్లమెంటు గురించి చెబుతున్నారా?" అడిగింది డ్రాయింగ్ టీచరమ్మ కిటికీలోంచి రాందాసు వైపు చూస్తూ.

"అవునండి."

"నేనుకూడా లోపల కూర్చుని వింటాను."

"కూర్చోండి" అన్నాడు రాందాసు ఆశ్చర్యంగా. ఆవిడ చాలా సంతోషంగా క్లాసులోకి వెళ్ళి కూర్చుంది. తర్వాత క్లాసులు లేనివాళ్ళు, ఉన్నా చెప్పని వాళ్ళు, "గొడవచేస్తే చంపేస్తా" నని వార్నింగ్ ఇచ్చి వరండాలో తిరిగే టీచర్లు, టీచరమ్మలు వెనక బెంచీల మేధావుల్ని ముందుకు నెట్టి ఆ బెంచీలు ఆక్రమించారు. రాందాసు 'దే కేమ్, దే సా, దే కాంక్వర్డ్' అనుకుంటూ ప్రారంభించాడు.

"రాజ్యసభని ఎగువ సభ అనీ, లోక సభని దిగువ సభ అనీ అంటారు. ఈ రెంటికీ తేడా ఏమిటి?"

"లోకసభలో మనం ఎన్నుకున్న ప్రజా ప్రతినిధు లుంటారు, సార్. రాజ్యసభలో ప్రజా ప్రతినిధు లెన్నుకున్న ప్రతినిధు లుంటారు, సార్."

డ్రాయింగ్ టీచరమ్మ ఆశ్చర్యం ప్రకటించింది.

"నగం రైట్. లోక సభ కార్యక్రమాల్ని ఎవరు నడిపిస్తారు?"

"స్పీకర్" అన్నాడు చాక్లెట్. వాడు చాక్లెట్లు తింటున్నంత సేపు బుద్ధిగా పాఠం వింటాడు. లేకపోతే గొడవ చేస్తాడు. ఇప్పుడతని జేబులో చాక్లెట్లున్నాయి.

"హారి వెధవా!" అని సాశ్చర్యంగా తిట్టి "మరి రాజ్య సభ కార్యక్రమాల్ని?"

"ఛైర్మన్ నడిపిస్తాడు."

ఇంత రెడీమేడ్‌గా జవాబులు చెబుతుంటే 'హెడ్మాస్టరు జి. కె. లేదు, జి. కె. లేదని గొడవ చేశాడేమిటి? కేవలం క్లాసు ఎగ్గొట్టడానికి కాకపోతే?' అనుకున్నాడు రాందాసు అక్కసుగా.

"లోకసభ ఎన్నికల్లో బోల్డన్ని పార్టీలు పోటీ చేస్తాయి. వాటిలో ఎక్కువ సీట్లు గెల్చుకున్న పార్టీ నాయకుణ్ణి ఎన్నుకుంటుంది. ఆ నాయకుణ్ణి ప్రధాన మంత్రి అంటారు. ప్రధానమంత్రి తనకు నచ్చిన వాళ్ళతో మంత్రివర్గాన్ని ఏర్పాటుచేస్తాడు. మంత్రివర్గం ఎవరికి బాధ్యత వహిస్తుంది?"

ఎవరూ ఏం మాట్లాడలేదు. క్లాసంతా ఒక్కసారి నిశ్శబ్దంగా మారిపోయింది. వెనక బెంచీల్లోని టీచర్లు ఆ ప్రశ్నకి జవాబు తెలుసన్నట్టు ఫీలింగ్ పెట్టారు మొహాల్లో.

"ప్రజలకి."

"ప్రధాన మంత్రికి."

"రాష్ట్రపతికి."

"కాదు. పార్లమెంటుకి" అన్నాడు రాందాసు. "పార్లమెంటు విశ్వాసం ఉన్నంతకాలం మంత్రివర్గం పరిపాలిస్తుంది. లేకపోతే రాజీనామా చెయ్యాలి."

మేం మనసులో అనుకుందే నువ్వు చెప్పావన్నట్టు పిల్లలంతా 'కరెక్ట్, కరెక్ట్' అన్నారు.

"ఇప్పుడు మనం పార్లమెంటులాగా సభా కార్యక్రమాలు నడిపించాలి. దీన్ని 'మోడల్ పార్లమెంటు' అంటారు. లోక సభలోనూ, రాజ్య సభలోనూ ఉండే సభ్యుల్ని పాలక పక్షం, ప్రతిపక్షంగా విడదీయాలి. ఇప్పుడు మనలో కొంత మంది పాలక పక్షం సభ్యుల్లాగా, మరి కొంత మంది ప్రతిపక్ష సభ్యుల్లాగా నటించాలి. కుడివైపు బెంచీల్లో పాలక పక్షం కూర్చుంటుంది. ఎడమవైపు ప్రతిపక్షం కూర్చుంటుంది."

"నిజంగా మేం పార్లమెంటు సభ్యులమేనా, సార్?" అడిగాడు ఒక కుర్రాడు లేచి. అతని ముఖంలో పదివేల సూర్యుల కాంతి ఉంది.

"కాదు. అనుకోవడమే. కొంచెం సేపు పార్లమెంటు సభ్యుడినని అనుకో."

"నే ననుకోను, సార్" అన్నాడు వాడు.

"అందుకేరా, శుంఠా, నీకు లెక్కల్లో సున్నా వచ్చేది. లెక్కల్లో తెలీని విలువని 'ఎక్స్' అనుకోని చెయ్యరా అంటే, నువ్వలా అనుకోవు. దాంతో ఎప్పుడూ సున్నాయే నీకు" అన్నాడు రాందాసు.

"అయితే నేను ఇండిపెండెంటుని" అన్నాడు వాడు. రాందాసు ముఖం మీద ఐస్ వాటర్ పోసినట్టు ఫీలెయ్యాడు.

"నీ ఇష్టం వచ్చినట్టు అనుకో. నాకేమిటి?" అని అరిచి "పాలక పక్షంలో ఉండాలనుకున్న వాళ్ళు కుడి వైపు కూర్చోండి. ప్రతిపక్షం వాళ్ళు ఎడమవైపు కూర్చోండి."

అయిదు నిమిషాలు ధన్ ధన్‌మని చప్పుళ్ళు. కుర్రాళ్ళంతా అత్యుత్సాహంగా ఎడమవైపు బెంచీల్లోకి వెళ్ళి ఒకడి మీద మరొకడు కూర్చున్నారు. ఇండిపెండెంట్ వీరు డొక్కడే కుడివైపు బెంచీ మధ్య వ్యాసం మధ్య బిందువులా కూర్చున్నాడు.

"ఏమిట్రా ఇదంతా? పాలక పక్షంలో ఒకడే ఉంటే ప్రభుత్వం ఎలా నడుస్తుంది?" ఆక్రోశించాడు రాందాసు.

"అపోజిషన్లో కూర్చుంటే వాకౌట్ చెయ్యొచ్చు గదా, సార్?" అన్నాడు పొట్టి శీను నోరు తెరచి నవ్వుతూ. రాందాసు మండిపడ్డాడు. కాని, వెధవకి నాలుగు తగిలిస్తే రేపు సిగరెట్లు తెప్పించుకోవడం సాధ్యపడదని తమాయించుకున్నాడు.

"హారి పిల్లలూ!" ఆశ్చర్యపోయారు వెనక బెంచీల్లోని టీచర్లందరూ ఏకగ్రీవంగా.

"నా కీ ఐడియాయే లేదు" అంది డ్రాయింగ్ టీచరమ్మ నవ్వుతూ.

"పాలక పక్షంలో ఎక్కువ మంది కూర్చోండి. అపోజిషన్లో తక్కువ మంది ఏడవండి." అరిచాడు రాందాసు సీరియస్‌గా. పిల్లలు గోమాతల్లా బెంచీలు మారారు.

"నేను స్పీకర్‌ని. నేను చెప్పినట్టు మీరంతా వినాలి. మనలో ఒకడు రాష్ట్రపతిగా కూడా ఉండాలి" అన్నాడు రాందాసు.

"నే నుంటా న్నే నుంటా న్నే నుంటాను" అని పిల్లలంతా పెద్ద పెట్టున అరిచారు.

"ఆ పదవికి ఇంత డిమాండేమిటి?" అడిగాడు రాందాసు ఆశ్చర్యంగా.

"పనేం ఉండదు కదా, సార్?" అన్నాడు చాక్లెట్.

"పార్లమెంటు గురించి మీక్కాదురా, నాకు...నాకు...నాకే ఏమీ తెలీదు." మళ్ళీ ఆక్రోశించాడు రాందాసు.

"రాజ్య సభ సభ్యుల్ని ఎలా ఎన్నుకుంటారు? ఇందాక చెప్పిన జవాబే మళ్ళీ చెబితే చంపేస్తాను."



మళ్ళీ క్లాసంతా నిశ్శబ్దమైపోయింది. టీచర్లు కిటికీలోంచి బైటికి చూస్తూ కూర్చున్నారు. ఆ ప్రశ్నకి వాళ్ళకీ జవాబు తెలీదు (తెలిసినచో వారా విధముగా దిక్కులు చూడరు. తమకు అత్యంత ప్రీతిపాత్రుడైన విద్యార్థి చెవిలో జవాబు చెప్పి, ఆ విద్యార్థి దానిని క్లాసు ముఖంగా ప్రకటించినప్పుడు వారు లోలోపల గర్వింతురు).

"వాళ్ళ నెలా ఎన్నుకుంటారంటే, ప్రతి రాష్ట్రంలో కూడా లోక సభ, రాజ్య సభ ల్లాగానే రెండు సభ లుంటాయి. వీటిని విధాన సభ, విధాన పరిషత్ అంటారు. ఈ రెండు రాజ్య సభ సభ్యుల్ని ఎన్నుకుంటాయి. ఈ సభ్యుల్లో పన్నెండు మందిని రాష్ట్రపతి నామినేట్ చేస్తాడు. ఆర్థిక బిల్లులు తప్ప మిగతా బిల్లుల్ని ఏ సభలోనైనా ప్రవేశపెట్టొచ్చు. ఆర్థిక బిల్లుల్నిమాత్రం లోక సభలోనే ప్రవేశపెట్టాలి."

వెనక బెంచీ టీచర్లు ఆశ్చర్యంగా విన్నారు. వాళ్ళవైపు ఓ సారి చూసి 'అర్థమైందా?' అన్నాడు రాందాసు.

అర్థం కాలేదంటే మళ్ళీ చెబుతాడేమోనని పిల్లలంతా 'అర్థమైంది, సార్' అని ఏక కంఠంతో అరిచారు. మేధావుల బెంచీకి ముందు బెంచీలో కిటికీ పక్కనే ఉన్న నరసింహం ఓ కాగితం మీద బొమ్మ గీస్తున్నాడు. 'మోడల్ పార్లమెంట్' అని చెప్పగానే ఆ బొమ్మ వేయడం ప్రారంభించాడు నరసింహం. అతణ్ణి రాందాసు గమనించలేదు.

"లోక సభ చర్చించబోయే విషయాల్ని లిస్టుగా తయారు చేస్తారు. ఈ లిస్టుని 'అజెండా' అంటారు. అజెండా ప్రకారం సభ నడుస్తుంది. మంత్రివర్గాన్ని ప్రశ్న లడగడానికి కొంత టైమ్ ఇస్తారు. ఈ ముందు బెంచీ వాళ్ళు మంత్రివర్గం సభ్యులు. వీళ్ళని మీరు ప్రశ్నలు అడగొచ్చు" అన్నాడు రాందాసు. వెంటనే చాక్లెట్ లేచి నిలబడ్డాడు.

"చాక్లెట్ ధర రోజు రోజుకీ పెరిగిపోతోంది. మొన్న అయిదు పైస లున్న చాక్లెట్ ఇవాళ పది పైసలు. దీని ధర ఎందుకు పెరుగుతోంది? దీనికి ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి జవాబు చెప్పాలి."

"చాక్లెట్ ధరని అదుపులో పెడతామని హామీ ఇస్తున్నాను."

"ఒకే బ్రిడ్జి దగ్గర మూడుసార్లు బస్సులు బోల్తాపడ్డాయి-ఎందుచేత?" మరొకడు అడిగాడు. ముందు బెంచీలోని రవాణా మంత్రి లేచాడు.

"తెలీదు."

ప్రతిపక్షం పిల్లలు 'షేమ్, షేమ్' అని అరుస్తూ బెంచీలమీద చేతుల్తో కొట్టారు. కొందరు చప్పట్లు కొట్టారు. పాలక పక్షం పిల్లలు లేచి నిలబడి అరిచారు. ప్రతిపక్షం పిల్లలుకూడా లేచి అరిచారు. అంతా గందరగోళం అయిపోయింది. రాందాసు 'ఆపండి' అని గర్జించాక క్లాసు నిశ్శబ్దంగా మారింది.

"ఇలా గొడవ చెయ్యకూడదు" అన్నాడు రాందాసు.

"పార్లమెంటులో నానా గొడవ జరిగిందని మా నాన్న చెబుతుంటారు, సార్" అన్నాడు పొట్టి శీను. రాందాసుకి ఏం చెప్పాలో అర్థం కాలేదు.

"బిల్ పాసు కావడం అంటే ఏమిటో చెప్పండి."

"నేను చెబుతాను, సార్" అన్నాడు బజ్జిబాబు. అతను గుండ్రంగా, లావుగా ఉంటాడని పిల్లలతనికి ఆ పేరు పెట్టారు.

"ఒక తీర్మానం ప్రవేశపెట్టగానే దానిమీద సభ్యులు వాదోపవాదాలు చేస్తారు. పాలక పక్షం వాళ్ళు ఆ తీర్మానం చాలా అవసరం అంటారు. ప్రతిపక్షం వాళ్ళు అనవసరం అంటారు. ఆ తీర్మానాన్ని పాలక పక్షం ఆమోదిస్తే 'బిల్ పాసైంది' అంటారు. అప్పుడు మేమంతా వాకౌట్ చేస్తాం."

"గుడ్." మెచ్చుకున్నాడు రాందాసు.

"బిల్లు ప్రవేశపెట్టమని చెప్పండి, సార్" అన్నాడు బజ్జిబాబు చాలా ఆదుర్దాగా.

"నీ కుళ్ళు ఆలోచన నాకు తెలుసురా, బజ్జీ. ప్రతిపక్షంలో ఉన్నాను, బైటకి వెళ్ళొచ్చని నీ బోడి ప్లాన్. డొక్క చించేస్తాను-కూర్చో." అరిచాడు రాందాసు.

"చిన్న డౌటు, సార్" అన్నా డొకడు లేచి. అతని షర్టు పొడుగ్గా, నిక్కరు పొట్టిగా ఉంది.

"బిల్లుల్ని రాజ్యసభ ఆమోదించినా, ఆమోదించకపోయినా చట్టంగా మారుతుంటే ఇంకా రాజ్య సభ ఎందుకు, సార్?"

"ఎందు కేమిటి నీ మొహం? ఉండా లంతే."

"ఎందుకుండాలి, సార్?"

"చంపేస్తాను. ఉండాలంటే ఉండాలి. అంతే ...కూర్చో." అరిచాడు రాందాసు (విద్యార్థు లడిగిన ప్రశ్నకి ఉపాధ్యాయునికి సమాధానము తెలియనిచో, అతడు మండిపడి, విసుగు చెంది, ముఖంలో భయంకరమైన కోపంతో చంపుదునని బెదరించును).

"సభ్యులారా, మిత్రులారా! ఇటు చూడండి" అన్నాడు కిటికీ పక్కనున్న నరసింహం. అందరూ అతనివైపు చూశారు. అతని చేతిలో ఓ డ్రాయింగ్ షీటు ఉంది.

"ఏమిటది!" అడిగాడు రాందాసు.

"కాసెట్ బొమ్మ."

"ఇప్పుడు కాసెట్ బొమ్మతో ఏం పని?" అయోమయంగా అడిగాడు రాందాసు.

"నన్ను పార్టీ ఫిరాయించమని పాలక సభ్యుడు అడిగాడు. అతని మాటల్ని ఇందులో టేప్ చేశాను. ఇది మొయిలీ టేపు" అన్నాడు నరసింహం. రాందాసు గుండె బాదుకున్నాడు.

"స్టాప్...స్టాప్...మీకు అవసరమైన జి. కె. కంటె ఎక్కువ జి. కె. ఏడ్చి చచ్చింది. సభని వాయిదా వేస్తున్నాను" అని బైటికి పరిగెత్తాడు రాందాసు. టీచర్లంతా నరసింహం వైపు అభినందనపూర్వకంగా చూసి స్టాఫ్ రూమ్ వైపు నడిచారు.

"పార్లమెంటు గురించి మాకు తెలీని ఎన్నో విషయాలు చెప్పారు. చాలా థాంక్సండీ, రాందాసు గారూ" అంది డ్రాయింగ్ టీచరమ్మ, ఆవి దెప్పుడూ రేడియో వింటుంది.


"మోడల్ పార్లమెంటుని ఇంత పిన్ పాయింటెడ్‌గా నడిపిస్తా రనుకోలేదు" అన్నాడు మరో టీచరు.

"పార్లమెంటు గురించి మన వెధవలకి అన్ని విషయాలు తెలిసిపోయాయి" అంది మరో టీచరమ్మ. వాళ్ళందరి మొహాల్లోనూ బ్రహ్మజ్ఞానం తెలిసిపోయిందన్న ఫీలింగు ఉంది.

లెసన్ ప్లాన్ పుస్తకం, పెన్నూ తీసుకున్నాడు రాందాసు. పావుగంటలో లెసన్ ప్లాన్ రాశాడు. మరో చిన్న కాగితం మీద ఇలా రాశాడు:

"పార్లమెంటు గురించి మన పిల్లలకి చాలా అనవసరమైన నాలెడ్జి ఉంది. ఎటొచ్చీ మన టీచర్లలో కొందరికి జి. కె. తక్కువని సోదాహరణంగా రుజువైంది."

ఆ కాగితాన్ని లెసన్ ప్లాన్ రాసిన పేజీకి పిన్ చేసి గోవిందాన్ని కేకేశాడు రాందాసు.




డుంబు

బుజ్జాయి